
# చిల్లి కుండ




పొట్లంకి వెంకట్రావ్



బయట జోరుగా వర్షం కురుస్తోంది.

ఉదయం అనగా మొదలయిన వాన- ఎప్పటికీ తగ్గటం లేదు. ఆకాశం నుండి జారుతున్న వెండి దారాల్లా తెల్లగా మెరుస్తూ కన్పిస్తున్నాయి వర్షధారలు. వాటి

వెనుక గాలికి జోరుగా ఊగుతున్న కొబ్బరి చెట్టుని. కిటికీ లోంచి సౌజన్య అలాగే చూస్తోంది. కిటికీ కున్న కర్టెన్‌లు తొలగించి తీరిగ్గా అక్కడో కుర్చీ వేసుక్కూర్చొని వీధిలోని వర్షంలోకి చూస్తోంది.

అలా వర్షం వైపు, వర్షంలో తడుస్తూ అటూ-ఇటూ ఊగుతున్న కొబ్బరి చెట్టువైపు చూస్తుందేగాని. ఆమె మనసు మాత్రం బయట వర్షంలాగే ఎడతెగని ఆలోచనలతో నిండి పోయి ఉంది. ఆ ఆలోచనలు ఒక కొలిక్కి రావటంలేదు. ఎంత ఆలోచించినా మనసు రక రకాలుగా పరిభ్రమిస్తుందే గాని ఏ నిర్ణయం వద్దా కేంద్రీకృతం కావటం లేదు. తనలోని లోపం ఏవిఁటో ఎంతకీ అంతుబట్టటం లేదు.

'తను ఆడదానిగా పుట్టటం తప్పా? విచ్చల విడిగా తిరుగుతూ భార్యను అలక్ష్యం చేస్తుంటే భర్తను నిలదీసి అడగటం తప్పా? ఇంట్లో అందమైన భార్య ఉండగా. ఎక్కడెక్కడో, ఎవరెవరితోనో తిరిగి వస్తుంటే ఏ ఆడది మాత్రం సహించగలదు? పోనీ, తనేమైనా ఆయనకి లోపం చేస్తుందా అంటే అదీ లేదు! ఉదయం బెడ్ టీ దగ్గర్నుంచి రాత్రి ముద్దూ-ముచ్చట వరకూ అన్నీ సరిగ్గానే అనుకూలంగానే అందిస్తుంది. మరింకేఁవిటి తన లోపం?

'లోపమల్లా తను ఆయనని ఎటో తిరుగుతున్నారని సూటిగా అడగటంలోనే ఉంది. కాని, అలా అడగటం తన తప్పు కాదే! పొద్దంతా ఇంటి పనితో అలసిపోతుంది. రిలీఫ్ కోసం ఏదో ఫస్ట్ షో సినిమాకెళ్దామని ఆయన్తో అంటోంది. ఆయనగారు ఆ వెధవ ముండ లేడీ టైపిస్టుతోనో- మరింకెవతితోనో ముచ్చట్లాడుకొని ఏ పదకొండుకో ఇంటికి వస్తారు. 'సినిమా' అంటూ ఆయన కోసం చూసి చూసి విసిగిపోయి, అలాగే మంచంమ్మీద వాలిపోయి కునికి పాట్లు పడుతుంది.

'కాలింగ్ బెల్ శబ్దంతో ఎక్కడ్లేని చిరాకు తనలో నిండిపోయి, తలుపు తీసి, ముఖంమ్మీదే అన్నీ అడిగేస్తుంది. అదీ తన లోపం! లోపం అయితే కావచ్చు కానీ, తప్పు కాదు కదా! సహభాగినిగా, అతనితోబాటు తనూ సంతోషాన్ని సమంగా పంచుకోవలసిన ఆడదానిగా అలా అడగటం తప్పెలా అవుతుంది?....'

ఇదీ సౌజన్యలో చెలరేగుతున్న రభస. ఎంతకీ తెగని ముడిపడని

ప్రశ్నల పరంపర ఆమె మెదడును రంపపు కోతకు గురి చేస్తుంది. బుర్ర వేడెక్కిపోతుంది. 'కాఫీ తాగినా బాగుణ్ణు' అని అనుకున్న సౌజన్య వంగి, వంటింటి గది వైపు చూసింది. ఆమె తల్లి కామాక్షి కాఫీ కలుపుతున్నట్లుంది. 'తెస్తుందిలే' అని అనుకుంటూ కుర్చీలో వెనక్కి వాలి కూర్చుంది. మళ్ళీ ఆలోచిస్తుంది.

సౌజన్య భర్త వాసుదేవరావు-విజయనగరంలో ఉంటున్నాడు. కమర్షియల్ టాక్స్ ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆయనకు సౌజన్యతో పెళ్ళయి ఇంకా ఒక సంవత్సరమయినా కాలేదు. అప్పుడే ఇన్ని స్పర్థలు, ఇన్ని తగాదాలూన్ను ఇద్దరికీమూణ్ణాలలుగా పడటం లేదు. చీటికీ- మాటికీ ఏవో చిల్లర తగువులు వస్తూనే ఉన్నాయి. వాటిని మాటకు మాటా పెంచుకొని పదింతలు చేసుకుంటూరు. దానితో వారిరువురూ ఎడమొగం- పెడమొగం. పెద్ద తగువు పెట్టుకుని. తన తండ్రి రామారావు గారు పెద్ద పేరున్న లాయరన్న ధీమాతో పార్వతీపురం కన్నవారి ఇంటికి వచ్చేసింది సౌజన్య.

అలా వచ్చేసిందేగాని ఎన్ని రోజులని ఉండగలదు? మూడు రోజుల తర్వాత మళ్ళీ వాసు దగ్గరికి వెళ్ళిపోయింది.

"ఏం- మళ్ళీ వచ్చేసావ్? మీ అమ్మగారింట్లో నే ఏడవలేక పోయావ్?" అని ఆయన ఈసడించుకోవటంతో సౌజన్యకి పౌరుషం వచ్చింది. ఇంట్లో అడుగయినా పెట్టకుండా తిరిగి వచ్చేసింది.

"ఏమిటీ, ఆలోచిస్తున్నావ్? 'కాఫీ- కాఫీ' అని పదిసార్లు పిలిచినా పలకవేం? ఇదుగో కాఫీ!" తల్లి మాటలకి ఉలిక్కి పడిన సౌజన్య ఆలోచనల నుండి తేరుకుంది.

కాఫీ అందుకుని తాగుతోంది.

"ఎందుకూ- పిచ్చిదానిలా ఆలోచిస్తూ కూచుంటావ్? నీ బాగు కోరే పెద్ద వాళ్ళం- నిన్ను కన్న తల్లిదండ్రులం.... మేం ఏం చెప్పినా ఒంట పట్టించుకోవేం? ఉత్త మొండిదానివి. మొగుడు పెళ్ళాలన్నాక....'' కూతురు గుర్రుగా చూడటంతో ఏదో హితబోధ చేస్తున్న కామాక్షి ఆగిపోయింది

సౌజన్య కాఫీ త్రాగేసి ఖాళీ కప్పు తల్లికందించింది.

"ఏమయినా అంటే అలా గుర్రుగా చూస్తావ్. మా మాటలు కొంచెమయినా వినిపించుకోవేం?

పెళ్ళంటే ఏ మూడ్రోజుల ముచ్చటో కాత్తల్లీ! వెయ్యేళ్ళ బంధం. భార్యా-భర్తల మధ్య ఎన్నో స్పర్ధలొస్తుంటాయి. ఆ మాత్రానికే విరిగిపోతే ఎలా? ఏదో సర్దుకు పోవాలిగానీ...."

"అమ్మా! నీ ధర్మ సలహాలు ఎవ్వరికీ అక్కర లేదు గానీ, నన్నిలా ఉండనీ! మీ మాటల్తో నా మనస్సు పాడు చేసి నన్ను మరింత పిచ్చిదాన్ని చేయకండి!"

కామాక్షి మరి మాట్లాడలేదు. కాఫీ కప్పు పట్టుకుని వెళ్ళి పోయింది.

'ఛీ, ఏం మనుషులో ఏవిటో! ఒక వైపు ఆయనకి దూరమయ్యి ఒంటరిగా బాధ పడుతుంటే- ఇక్కడ వీళ్ళొకళ్ళు! కన్న కూతురని అయినా కాస్త అభిమానం లేకుండా నానా మాటలూ నన్నే అంటారు. ఛీ-ఛీ! మనసుకి శాంతి వుండటంలేదు' అని గొణుక్కుంటున్న సౌజన్యకు రంగి గుర్తొచ్చింది.

సౌజన్య వాళ్ళింట్లో పనిచేస్తున్న గంగమ్మ కూతురు రంగి. మొన్నీ మధ్యనే దానికి పెళ్ళయింది. మొగుడు తాగి తనను బాదేస్తున్నాడని అది కూడా తన లాగే ఇంటికి తిరిగొచ్చేంది. 'దొందుకు దొందూ' అన్నట్టు సౌజన్య, రంగి ఓ దగ్గర కూచొని మాట్లాడుకునే వారు.

"ఈ మగాళ్ళను నమ్మకూడదండీ! అందిన ఆడవాళ్ళతో తిరుగుతారు, తాగుతారు, పెళ్ళాన్ని బాత్తారు. ఆడదంటే ఓ ఆడబొమ్మ నాగే సూత్తారు గానమ్మగోరూ! మన మంజే ఆరికెలాంటి ఖాతరూ నేదండీ! ఏటమ్మగోరూ! ఆడదానికి ఓ అచ్చట ముచ్చట చూపించ లేనోళ్ళు ఆరూ మగాల్లేనండి? ఎంతయినా పెల్లాం గదా ఆ మాత్ర మయినా గేనం ఆరికుండొద్దమ్మ గోరూ! అందుకే ఆణ్ణొగ్గేసి ఎలిపో వచ్చేసాను. ఆడే రెం(డ్రోజులు పోతే ఎతుక్కొని వత్తాడు" అని అంటుండేది.

"ఆఁ-ఆఁ! వత్తాడు. వచ్చి నిన్ను నెత్తికెక్కించుకుని తీసుకెల్తాడు. అలాగే సూత్తా ఉండు- ఆడు ఇంకెవర్నో తెచ్చుకుని ఏలుకుంతాడు. అప్పుడు నీ బతుకు బుగ్గి పాలయ్యిపోతాది. అంతవరకూ ఇలాగే కూకో!" అని గంగమ్మ రంగిని తిడుతూండేది.

"అదేంవిటి గంగమ్మా! అలా తిడతావ్? రంగి మాత్రం ఏం చేస్తుంది- అవతల అతను రోజూ తాగి వీపు చీరేస్తుంటే?" అని

రంగికి సపోర్టుగా మాట్లాడబోయేది సౌజన్య.

"ఆఁ-వీపు చీరేత్తే పడాలమ్మా! పెల్లంతే ఏటనుకుంతన్నారు? నూరేల్ల పంట. కట్టుకున్నాక మొగుడే అన్నీను. ఏం-ఈల్లాన్న నన్నెంతలా బాధేవోడు. అలాగని నేనూ ఆయన్నొదిలేసి ఉంటే నా బతుకు ఏటయిపోనూ? అలాగే సరుదుకు పోవాలమ్మా!" గంగమ్మ రంగికి చెబుతున్నట్టులేదు. తనకే నచ్చ చెబుతున్నట్టనిపించింది. మరి, సౌజన్య మాట్లాడలేకపోయింది. ఓ పనిమనిషి చేత చెప్పించుకున్నందుకు ఉక్రోషంతో లోలోపలే కుమిలిపోయింది.

గంగమ్మ మాటలు బుర్రకెక్కినట్టున్నాయి-రంగి దాని మొగుడు దగ్గరికి వెళ్ళిపోయింది.

ఇవన్నీ మనసులో కదిలి తల మరింత నొప్పి పట్టుకుంది.

'రంగిలా తను సర్దుకుపోలేదు. రంగివాళ్ళు అలగా మనుషులు. ఏదీ పెద్దగా పట్టించుకోరు. అప్పుడే విడిపోతారు, అప్పటికప్పుడే కలిసిపోతారు. కాని తను ఓ పెద్దింట్లో పుట్టింది. పెద్దగా కాకపోయినా కొంతవరకు చదువుకుంది. పొమ్మన్న భర్త దగ్గరకి మళ్ళీ వెళ్ళాలంటే అహం అడ్డొస్తుంది. అతనే వస్తాడు' అనుకుని ఎదురు చూస్తోంది.

'అవును, అతనెందుకు రాడు? తప్పక వస్తాడు. అతను నా కెంత అవసరమో, అతనికి నేనంతే అవసరం. నేను అతని క్కావాలంటే అతనే వస్తాడు' అని అనుకుంటుందేగాని, లోపల మాత్రం ఏదో చెప్పరాని భయం ఆమెలో నిండిపోతుంది.

పడుకుంటే నిద్రరాదు. సరిగా అన్నం సహించదు. ప్రతి నిముషం ఆమె తలంపు వాసుమీదే ఉంటుంది.

'ఆయ నిపుడేం చేస్తుంటారు? వంట చేసుకుంటుంటారా? ఆయనకేం కర్మ! హాయిగా హోటల్‌లో భోంచేస్తారు. ఆ లేడీ టైపిస్ట్‌తో షికార్లు కొడుతుంటారు. ఆయనకేం? ఆయన బాగానే ఉంటారు. ఛీ-ఈ మగవాళ్ళంతా ఇంతే! వాళ్ళలా ఆడవాళ్ళు తిరగలేరు. తిరిగితే ఈ మగాళ్ళు సహించలేరు. అందుకే ఆడదాని మెళ్ళో ఉరిత్రాడులా మంగళసూత్రం బిగించి తమ వెనుక తిప్పుకుంటుంటారు.'

ఏవేవో సౌజన్య పిచ్చిగా ఊహించుకుంటుంది. ఒక్కోసారి వాసుని తిడుతుంటుంది. ఇంకోసారి తనని నిందిస్తున్న తల్లిదండ్రుల్ని, గంగమ్మని తిట్టుకుంటుంది. మరో

సారి తనని తనే తిట్టుకుంటుంది. ఎప్పటికీ ఏ నిర్ణయంతోనూ రాజీ పడలేకపోతుంది.

సౌజన్య వాళ్ళ నాన్న రామా రావుగారు ఏదో పనిమీద విజయ నగరం వెళ్ళి రెండ్రోజులయ్యింది. ఇంకా రాలేదు. ఆయన వస్తారని సౌజన్య ఎదురుచూస్తోంది. వస్తే భర్త వాసుదేవరావు నుంచి ఏదైనా వార్త మోసుకొస్తారని ఆశ.

సాయంత్రం ఐదవుతుంది. రామారావుగారొచ్చారు. ఆయనకు ఎదురెళ్ళిబ్యాగ్ అందుకుంది సౌజన్య. ఆ అందుకోటంలో 'ఆయనెలా ఉన్నారు?' అనే పరామర్శ ఆమెలో కనిపిస్తుంది. కానీ, నోరు తెరిచి అడుగలేదు.

"అమ్మాయ్! నువ్వు చేసిన పనేం బాగా లేదు." సౌజన్యవంకే తప్పుపెట్టి మాటలు ప్రారంభించే సరికి ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

"నువ్వేడ్చినా లాభం లేదు. నే నడిగిన ప్రశ్నలకు సమాధానాలు సూటిగా చెప్పు. అసలు నువ్వి క్కడి కెందుకొచ్చేశావ్?" కోర్టు బోనులో నిలబడిన ముద్దాయిని ప్రశ్నిస్తున్నట్టే అడిగారు లాయరు రామారావుగారు.

"అదేంటి నాన్నా!...." 'మీకు తెల్సిందే కదా!' అన్నట్టు మాట్లాడ బోయింది.

"నే నడిగిం దానికి సూటిగా జవాబు చెప్పు. నువ్వెందు కొచ్చే శావ్?"

"ఆయన-మళ్ళీ ఎందుకొచ్చావ్ పొమ్మని అన్నారు, వచ్చేశాను." ఏడుపు ముఖంతోనే చెప్పింది.

"అహాఁహాఁ- ఇప్పుడు కాదు. అతను ఎందుకొచ్చేశావ్ అని అడి గాడే- అంతకు ముందిక్కడి కెందు కొచ్చేశావ్?"

"ఆయనకూ-నాకూ పడలేదు. వచ్చేశాను."

"పడలేదు అంటే? అసలేం జరిగింది?" కళ్ళద్దాల సందులోంచి చూస్తూ, చూపుడు వ్రేలాడిస్తూ అడిగారు.

"అతని వ్యవహారం నా కేఁవీ నచ్చలేదు నాన్నా! ఆయన నన్ను సినిమాకు, షికారుకు తీసుకెళ్ళరు. పైగా ఆ లేడీ టైపిస్టుతో తిరుగు తున్నారు...."

"ఆఁ-అదిగో అక్కడే వచ్చింది గొడవంతా. ఆయన లేడీ టైపిస్టుతో తిరగటం నువ్వు చూశావా?"

"చూడ్డమేఁవిటి నాన్నా!అందరూ అనుకుంటుంటేనూ."

"'అందరూ' అంటే? ఎవరు నీతో అన్నది?"

"వాళ్ళ ఆఫీసులో పనిచేస్తున్న ప్యూనే."

"ఏమని చెప్పాడు?"

"ఏమని చెప్పాలి? ఆయన ఆవిడతో తిరుగుతున్నారని."

"అలాకాదు. ఏమనిచెప్పాడో వివరంగా చెప్పు."

"'ఏం రా రాములూ! మీఅయ్యగారింకా ఇంటికి రాలేదు. ఎక్కడికెళ్ళార్రా?' అని అడిగాను...."

"ఊఁ- ఏం చెప్పాడు?"

"'ఆయన లేడీ టైపిస్ట్‌తో కలిసి సి.టి.ఒ. గారింటికి ఎల్లారండి' అన్నాడు."

"ఆ తర్వాత నువ్వేం అన్నావ్? ఎలా అన్నావో అలాగే చెప్పు!"

"'ఎవర్రా ఆ లేడీ టైపిస్ట్? అందంగా ఉంటుందా?' అని అడిగాను. 'చాలా అందంగా ఉంటుంద'ని అన్నాడు. 'పెళ్ళయిందా?' అని అడిగాను. 'లేద'ని చెప్పాడు. వెళ్ళిపోబోతుంటే మళ్ళీ పిలిచి, 'ఆయన-అదే వాసుగారు ఆ టైపిస్ట్‌తో ఎక్కువగా మాట్లాడుతారా?' అనడిగాను. దానికి వాడు విసుగ్గా, 'ఎందుకు మాట్లాడరండీ? మాట్లాడుకుంటార'ని చెప్పాడు...."

"ఆ తర్వాత నువ్వేం అన్నావ్? చెప్పు-ఐదు రూపాయలిస్తానన్నావు కదూ?"

"ఔను, ఇస్తానన్నాను. ఆయన ఆ టైపిస్ట్ ఎక్కడెక్కడ తిరుగుతుంటారో, ఏమిటేమిటి మాట్లాడుకుంటారో చెప్పమన్నాను."

"వాడు చెప్పాడు. ఐదు రూపాయలకు ఆశపడి వాడేవేవో చెప్పాడు. అవి విని నువ్వు ఆయన్ని అపార్థం చేసుకున్నావు. అప్పట్నుంచీ నీ వెధవ అనుమానాలతో వాసుని నానా రకాలుగా ఇబ్బంది పెట్టావు. ఏదో గట్టిగా కసిరాడని ఇల్లు వదిలి వచ్చేసావు. అంతేకదూ? పిచ్చిదానా! వాసుపట్ల నీకున్న ఎనలేని ప్రేమ వలన ఆయన ఇంకెవరి వల్లోనో పడిపోతారేమోనన్న భయంతో, పిచ్చి పిచ్చి అనుమానాలు బుర్రలో పెట్టుకున్నావు. అవేమో అనుక్షణం నీ మనసుని దొల్చేసి నిన్నీ పరిస్థితికి తీసుకొచ్చాయి.

"ఏదో ఒక రాత్రి ఆఫీసులో పనుండి రాత్రి పదకొండో, పన్నెండో గంటలకు ఇంటికొస్తే ఆ టైపిస్టుతో సరదాలు తీర్చుకున్నాడని అపోహపడ్డావ్. టైపిస్టు, ఓ హెడ్ గుమాస్తా కలిసి సి.టి.ఒ. గారింటికి ఏవో ఫైళ్ళు పట్టుకొని వెళ్తే అదీ తప్పుగానే ఊహించుకుంటావా? అలిగి వెళ్ళిపోయిన దానివి- నీకు నీవే తిరిగి అతని దగ్గరకు వెళ్తే, ఏదో హాస్యానికి

'మీ ఇంటిలోనే ఏడవలేక పోయావ్' అని అన్నంత మాత్రాన రోషంతో మళ్ళీ కన్న వారొకరు ఇక్కడ తగలబడ్డారని ఇంటికి వచ్చేయడమేనా?

"వాసు ఆణిముత్యం లాంటి వాడే! అతణ్నే అనుమానించావ్. ఇప్పుడు నీ గతేం కాను? అతనికి నీ మీద మనసు విరిగిపోయింది. రేపో, ఎల్లుండో వచ్చి డైవోర్సు కాగితాల మీద నీ చేత సంతకం చేయించుకుంటాడు. ఏం చేస్తావో అదే చెయ్యి! తప్పంతా నా కూతుర్లో పెట్టుకుని నేనేం అతనికి ఎదురు తిరగ్గలను? ఏవేఁ కామాక్షీ! పొయ్యి మీద కాస్త వేణ్నీలు పడేసావా? తల దిమ్మెక్కి పోయింది. తల స్నానం చేయాలి. ఆ నీళ్ళు బాత్‌రూంలో పెట్టు. వస్తున్నాను" అంటూ రామారావు గారు లోపలి కెళ్ళిపోయారు.

సౌజన్య మంచమ్మీద కుప్పలా కూలిపోయి, తలగడలో ముఖం పెట్టి వెక్కి వెక్కి ఏడుస్తోంది. తనమీద తనకే ఇప్పుడు అసహ్యమేస్తుంది. 'నిజమే! పనికిరాని చెత్త అనుమానాలన్నీ కల్పించుకుని ఇంతవరకూ తెచ్చుకుంది. బంగారం లాంటి వాసుమీద అన్ని అభాండాలు వేసి బుర్ర పాడుజేసుకుంది.' ఒక్కసారిగా వాసుమీద సౌజన్యకు పుట్టెడు ప్రేమ ముంచుకొచ్చేసింది. వెళ్ళి అమాంతం అతని గుండెల మీద వాలిపోవాలనిపించింది.

ఆ రాత్రి భోంచేయ లేదు. పడుకోనూ లేదు.

రాత్రంతా దబ-దబమని వర్షం పడుతూనే ఉంది. ఎప్పడో వాన వెలిసిన టైముకి తెల్లవారుఝామున నిద్రలోకి జారుకుంది సౌజన్య.

తెల్లారి లేపి, సౌజన్యకి తల స్నానం చేయించింది కామాక్షి. తను రానంటున్నా గుడికి తీసుకెళ్ళింది. గుడికెళ్తే సౌజన్య కొంత కుదుట పడవచ్చని ఆమె నమ్మకం.

అనుకోకుండా అక్కడ సౌజన్యకు ఎదురయ్యింది ఆమె స్నేహితురాలు సుశీల. ఇద్దరూ ఒకర్నొకరు పలకరించుకున్నారు.

"ఏవిఁటే, ఇలా నీరసించి పోయావ్? నిద్రలేనట్టు-ఆ కళ్ళేవిఁటి ఉబ్బిపోయాయి? మా అన్నయ్యగారు-అదే మీ ఆయనగారు నిన్ను బాగానే చూసుకుంటున్నారా?" అని సుశీల అడుగుతుంటే సౌజన్యకు దుఃఖం ముంచుకొచ్చింది.

"దీనికేమమ్మా, మారాణిలా చూసుకుంటాడు అతను. చాలా

మంచివాడు" అంటూ కామాక్షి సర్ది సమాధానం చెప్పింది.

"ఇంతకీ ఇప్పు డెక్కడుం టున్నావు?" మాట మారుస్తూ అడిగింది సౌజన్య.

"విజయ నగరంలో ఉంటు న్నాను."

"విజయనగరంలోనా! అవునూ మొన్నా మధ్యన ఏదో ఉద్యోగం వచ్చిందన్నావ్—ఏమిటి చేస్తు న్నావు?"

"టైపిస్టుగా పన్జేస్తున్నా?"

"టైపిస్టుగానా! ఎక్కడ? ఎందులో?"


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

హెడ్డాఫీస్:—5/1, బ్రాడీపేట, గుంటూరు-2 (ఎ.పి.)

బ్రాంచీలు: మార్వాడి గుడివద్ద, తెనాలి (ఎ.పి.)

ఫోన్: 551. 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

## దీర్ఘవ్యాధులకు పుత్తమ వైద్యము



దురభ్యాసములకు లోనై దాంపత్య సుఖము పొందలేని వార్కి, (నిరుత్సాహముచే ప్రాణహాని చేసుకొనరాదు.) హెర్నియా, చర్మ వ్యాధులకు పోస్టు ద్వారా కూడా చేయబడును.

వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులకు ఇసోఫీలియా (దమ్ము), ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండా చేయబడును; స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

NB: "శివలీల" తెలుగు పక్షపత్రిక అన్ని విషయములతో వెలువడుతుంది; చదవండి.

ఎడిటర్:- డా. పి. కుమారస్వామి దేవర, గుంటూరు (ఎ.పి.)

"అక్కడే కమర్షియల్ టాక్సు ఆఫీసులో."

సడన్ షాక్ తిన్నట్టయి పోయింది సౌజన్య.

"ఏమిటే అలా అయిపోయావ్? ఏమయ్యింది?" సుశీల గాభరాగా అడిగింది.

"ఏమీ లేదు. మీ ఆఫీసులో హెడ్ గుమాస్తా ఒకాయన ఉన్నారు."

"ఆయనా- వాసుదేవరావుగారు. అవునూ, ఉన్నారు. ఆయన చాలా మంచివారు. నన్ను తోడబుట్టిన చెల్లెలుకంటే ఎక్కువగా చూసుకుంటుంటారు. ఆయనకు నేనంటే ప్రాణం. ఆయనకో చెల్లెలుండేదిట. అచ్చం నాలాగే ఉండేదిట. పాపం, ఆమె ఏదో అగ్ని ప్రమాదంలో చనిపోయిందిట. అవునూ- ఆయన్నీకెలా తెలుసు? కొంపదీసి ఆయనే మీ ఆయన కాదు కదా?" అంటూండగానే సౌజన్య స్పృహ తప్పి కామాక్షి గారి చేతులలోకి ఒరిగిపోయింది బొమ్మలా.

ఇంటికి తీసుకువచ్చి మంచమ్మీద పడుకోబెట్టారు. కొద్ది సేపటికి తెలివొచ్చి వెక్కి వెక్కి ఏడ్చింది. తన పాపానికి నిష్కృతి లేదనుకుంది. తనని తాను శపించుకుంది ఎంతో ఘోరంగా.

"సౌజన్యా!" ఎదురుగా వాసు వచ్చి నిల్చున్నాడు.

సౌజన్య చూసింది.

"ఏమిటిలా అయిపోయావు?" కలవరపడుతూ ఆమె ప్రక్కనే కూర్చొని ఆమె తల నిమిరాడు ఎంతో ప్రేమగా.

సౌజన్యకు ఆపుకుందామన్నా దుఃఖం ఆగలేదు.

గబుక్కున లేచి, అతని గుండెల్లో ముఖం దాచుకొని, బావురుమని ఏడవసాగింది.

"పిచ్చి సౌజన్యా! మరీ చిన్నపిల్లలా ఏడుస్తావేం? ఊరుకో-నేనొచ్చేసాగా?" ఓదార్చాడు వాసు సౌజన్యను.

"ఏమండీ! నన్ను క్షమించండి! పదండీ, పోదాం—మనింటికి పోదాం. ఇక్కడ ఇంక నేనొక్క క్షణమైనా ఉండలేను- పదండి!" అంటూ లేచి ప్రయాణమయ్యింది సౌజన్య.

కామాక్షి—రామారావు గార్లు కూతుర్లో వచ్చిన మార్పుకి సంతోషించినా ఆమె పిచ్చిమనస్తత్వానికి వారి ఇద్దరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి.

ఇద్దర్నీ బస్సుకి దిగబెట్టి ఇంటికి తిరిగొచ్చారు రామారావు గారు

ఎంతో సంతో తేలికపడ్డ మనసుతో.

* * *

ఇంట్లో సామాన్లు సర్దుతున్న సౌజన్య వంగటదిలో ఓ మూల నేలంతా తడిసిపోయి ఉండటం గమనించి, మంచినీళ్ళ కుండని అటూ ఇటూ తిప్పి చూసింది. కుండకు చిన్న చిల్లుపడింది. అంతే! నీరంతా ఒక్క చుక్కయినా కుండలో మిగలకుండా క్రిందకు కారిపోయాయి.

సౌజన్య ఆ కుండనే చూస్తూ అలాగే ఉండిపోయింది. ఆ కుండ రహస్యాన్ని చెబుతున్నట్టుంది. కను రెప్పలు మూయకుండా అలాగే చూస్తుంది సౌజన్య. తనకీ ఆ కుండకీ తేడా ఏవీం కన్పించటం లేదామెకు. కుండెంత అందమైనదైనా, మరెంత పెద్దదయినా చాలా చిన్న చిల్లుకి లోకువయిపోయింది. మొత్తం నీరంతా నేలమీద కారిపోయింది.

అలాగే తన పరిస్థితీ తోచింది. 'చిన్న చిల్లులాంటి అనుమానమే ఎంత రభస చేసింది?'

"ఏవిటి సౌజన్యా! అలా ఆ కుండవైపే చూస్తూ కూర్చున్నావ్? చిల్లు పడింది. చిన్న సిమెంటు తీసి రాసేస్తే అదే మామూలయిపోతుంది. లే. త్వరగా వంట చెయ్యి. సినిమాకు వెళ్దాం" అని తొందర చేసాడు వాసు. *


విజయ
మాస పత్రికలో
సంచలనం సృష్టించిన
శ్రీప్రసాద్
చారిత్రాత్మక నవలలు

ఆర్యచాణక్య ..10.00
రోషనార ..8.00
అఫ్జల్ ..10.00
యుగంధర ..12.00

ఇప్పటికే
వేయి కాపీలు పైగా
అమ్ముడై
మీ అభిమానాన్ని
చూరగొన్న పుస్తకాలు.

నవజ్యోతి
పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ-2